సాక్షి
బాపట్ల
సోమవారం | 5 | మే | 2025



బల్లలు బహూకరణ

పెదకాకాని: పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి తక్కెళ్లపాడుకు చెందిన కోటేశ్వరరావు, అరుణకుమారి దంపతులు స్టీల్ బల్లలు బహూకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఇది 138.3868 టీఎంసీలకు సమానం.



ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నృత్య ప్రదర్శన నిర్వహించారు. నాట్య గురువులను సత్కరించారు.

న్యూస్‌రీల్

భావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పొన్నూరు: పట్టణంలోని సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, స్వామి, అమ్మవార్లకు పంచామృత స్నపన జరిపారు. స్వామివారు పెండ్లికుమారుని అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం నాదస్వర కచేరీ, వేద పఠనం, అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహం, రుత్విగ్వరణం, అంకురారోపణం, హోమం, బలిహరణం, ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

భగీరథ మహర్షికి ఘననివాళి



గుంటూరు వెస్ట్: భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని భగీరథ మహర్షి కీర్తిని వివరించారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, బీసీ సంక్షేమ శాఖాధికారి కె.మయూరి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్‌లో ముఖేష్‌కు రెండు స్వర్ణాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన షూటర్ ముఖేష్ నేలవల్లి రెండు బంగారు పతకాలు సాధించాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న 23వ కుమార్ సురేంద్ర సింగ్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం జరిగిన పోటీలో 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ సీనియర్, జూనియర్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఇదే పోటీల్లో గత శుక్రవారం కూడా 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్‌లోనూ ముఖేష్ బంగారు పతకం సాధించాడు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆది దంపతులైన దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తుల తాకిడితో అంతరాలయ దర్శనం నిలిపివేసిన ఆలయ అధికారులు, భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. రూ.300, రూ.100 టికెట్లతో పాటు సర్వ దర్శనం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 6 గంటల నుంచే భక్తులతో క్యూలైన్లు నిండిపోగా, మహ మండపం వైపు నుంచి వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకే లిఫ్టులో అనుమతించారు. అక్కడి నుంచి మెట్ల మార్గం ద్వారా భక్తులు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తడిసి ముద్దయ్యారు..

ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు వర్షంతో తడిసి ముద్దయ్యారు.

ఘాట్‌రోడ్డు మూసివేత..

ఆదివారం ఉదయం 8 గంటలకు భారీ వర్షం కురవడంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డును ఆలయ అధికారులు మూసివేశారు. సుమారు గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో కొండ రాళ్లు విరిగిపడే ప్రమాదం ఉందని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు భావించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఘాట్‌రోడ్డుపైకి ఎటువంటి వాహనాలను అనుమతించలేదు.

అకాల వర్షం.. తీవ్ర నష్టం

- జిల్లావ్యాప్తంగా పలుచోట్ల పెనుగాలులతో కూడిన భారీ వాన
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగులు
- రూ.8 కోట్ల మేరకు దెబ్బతిన్న ఇటుక పరిశ్రమలు
- కొన్నిచోట్ల నేలవాలిన అరటి, తమలపాకు పంటలతో రైతులకు కష్టాలు



తోకలవారిపాలెంలో నేలకూలిన విద్యుత్తు స్తంభం

కొల్లూరు: అకాల వర్షం కారణంగా కృష్ణా తీర ప్రాంతంలో తీవ్ర నష్టం వాటిల్లింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పెను గాలులతో కురిసిన వర్షం ప్రభావం ఇటుక పరిశ్రమలపై తీవ్రంగా పడింది. మండలంలోని లంక గ్రామాలలో పచ్చి ఇటుక వర్షం కారణంగా తడిసి పనికిరాకుండా పోయిందని ఉత్పత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల క్రితం కురిసిన వర్షం కారణంగా కోట్లలో పచ్చి ఇటుక పాడైపోయి నష్టాల పాలయ్యామని, ఈ తరుణంలో రెండో దఫా కురిసిన వర్షంతో నష్టం తీవ్రత అధికంగా ఉంటుందని ఇటుక పరిశ్రమ నిర్వాహకులు వాపోతున్నారు. వర్షం కారణంగా సుమారు 2 కోట్లకు పైగా పచ్చి ఇటుక పనికి రాకుండా పోవడంతో బట్టీల ఏర్పాటు సాధ్యపడదన్న ఆందోళన పరిశ్రమదారుల్లో వ్యక్తమవుతుంది. బట్టీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలంటే వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే అదనంగా మరో 20 రోజులు పరిశ్రమ నిర్వహణ గడువును పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటుక తయారీ, బట్టీలు ఏర్పాటు చేసే కూలీల నిర్వహణ, ముడి సరకుకు పెట్టుబడులు అదనంగా పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. వర్షం కారణంగా సుమారు రూ. 8 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని ఇటుక తయారీదారులు ఆవేదన చెందుతున్నారు.

రైతన్నలకు తప్పని అవస్థలు

పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని అరటి, తమలపాకు తోటలు స్వల్పంగా నేలవాలి రైతులకు నష్టం వాటిల్లింది. వాతావరణంలో మార్పులు గమనించిన మొక్కజొన్న రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలపై టార్పాలిన్‌లు కప్పుకొని పంటను కాపాడుకుంటున్నారు. వర్షం ప్రభావం కొనసాగిన పక్షంలో ఈ కండెలు సైతం పనికిరాకుండా పోతాయన్న ఆందోళన రైతాంగంలో ఉంది. గాలుల ధాటికి మండలంలోని పలు ప్రాంతాలలో విద్యుత్తు స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. పెను గాలుల కారణంగా విద్యుత్తు సరఫరాకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు శాఖ సిబ్బంది వేమూరు మండలం నుంచి కొల్లూరు మండలం వరకు లైన్‌లను తనిఖీ చేసి ఆదివారం రాత్రికి సరఫరాను పునరుద్ధరించారు.

వణికిన చీరాల

చీరాల రూరల్: చీరాలలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అప్పటి వరకు ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతోపాటు చల్లగాలులు వీయడంతో కొంత ఉపశమనం పొందారు. అయితే ఆలోపే ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన భారీగా కురిసింది. గంటపాటు ఉరుములు, మెరుపులతో కుండపోతగా పడింది. పెద్ద శబ్దాలతో భారీ పిడుగులు పడ్డాయి. విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. చీరాల రైల్వే స్టేషన్ ముందున్న భారీ హోర్డింగులు నేలకొరిగాయి. అక్కడ నిలిపిన ఆటోపై పడటంతో పైభాగం పూర్తిగా దెబ్బతింది. సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూలు క్రీడామైదానం వర్షపునీటితో చెరువులా మారిపోయింది.



కొల్లూరు సమీపంలో తడిసిన పచ్చి ఇటుకలు



పెసర్లంక అరవింద వారధి వద్ద టార్పాలిన్ కప్పి ఉంచిన మొక్కజొన్న కండెలు



కొల్లూరు మండలం కృష్ణానగర్ మార్గంలో రహదారికి అడ్డుగా పడిపోయిన వృక్షం



చీరాల రైల్వే స్టేషన్ వద్ద కూలిన భారీ హోర్డింగులను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పిడుగుపాటుకు యువకుడు బలి

- ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా బలిగొన్న పిడుగు
- ప్రాణాలతో బయటపడిన మరో యువకుడు



సంఘటన స్థలంలో సుప్రదీప్ మృతదేహం



మాతంగి సుప్రదీప్ (ఫైల్)



పాగోలు అనిల్‌కుమార్

కొల్లూరు: పిడుగుపాటుకు గురై ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కోసూరుకు చెందిన మాతంగి సుప్రదీప్ (23) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతంలో పనులకు సంబంధించి మాట్లాడుకునేందుకు కోసూరుకు చెందిన తన మిత్రుడు పాగోలు అనిల్‌కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. కృష్ణా జిల్లా శ్రీకాకుళం – బాపట్ల జిల్లా గాజుల్లంక నడుమ కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన గాలు మార్గం ద్వారా తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో నదిలో మధ్యకు వచ్చే సమయానికి అకస్మాత్తుగా వర్షం ప్రారంభమైంది. బాపట్ల జిల్లా గాజుల్లంక సమీపంలోకి వచ్చేయడంతో గ్రామంలో ఆగవచ్చన్న ఉద్దేశంతో ద్విచక్ర వాహనంపై ముందుకు ప్రయాణం సాగించారు. అదే సమయంలో పిడుగుపాటుకు గురయ్యారు. బైకు నడుపుతున్న సుప్రదీప్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వాహనం వెనుక కూర్చున్న అనిల్‌కుమార్ పిడుగు పడిన ధాటికి వాహనంపై నుంచి ఎగిరి ఆ మార్గంలో పడిపోయి స్పృహ కోల్పోయాడు. కొద్ది సమయానికి తేరుకున్న అనిల్ లేచి చూసే సరికి సుప్రదీప్ మృతి చెందినట్లు గుర్తించాడు. వారి బంధువులకు సమాచారం అందజేశాడు. కొల్లూరు ఏఎస్ఐ కట్టా వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుప్రదీప్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. సుప్రదీప్‌కు భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

గొర్రెల కాపరి కూడా...

చినగంజాం: పొలాల్లో గొర్రెలు మేపుకొంటున్న వ్యక్తి పిడుగుపాటుకు గురై మృతి చెందిన సంఘటన ఆదివారం చినగంజాంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల సమాచారం ప్రకారం.. మండలంలోని చినగంజాం పంచాయతీ రామకోటేశ్వర కాలనీకి చెందిన గడ్డం బ్రహ్మయ్య (47) రోజూ మాదిరిగానే గొర్రెలు తోలుకొని చినగంజాం గ్రామ పరిధిలోని కొమ్మమూరు కాలువ సమీపంలోకి వెళ్లాడు. పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్వో డానియేలు ఫిర్యాదు మేరకు పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల వైద్యశాలకు తరలించారు. బ్రహ్మయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మరొకరి పరిస్థితి విషమం

కొల్లూరు: గొర్రెల కాపరిగా జీవనోపాధి పొందుతున్న మహబూబ్‌నగర్ జిల్లా వాసి పిడుగుపాటుకు గురైన సంఘటన కొల్లూరు సమీపంలోని పంట పొలాల్లో చోటుచేసుకుంది. కొల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది, స్థానికుల కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కోయలకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన అంజి అనే గొర్రెల కాపరి. అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద జీతానికి పనిచేస్తున్నాడు. ఆదివారం పిడుగులతో కూడిన వర్షం కురిసిన సమయంలో పంట పొలాల్లో గొర్రెలు మేపుకుంటున్న అంజి తన మొబైల్ ఫోన్‌కు పవర్‌బ్యాంక్‌తో చార్జింగ్ పెట్టి బంధువులతో కాల్‌లో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో అతనికి అతి సమీపంలో పిడుగు పడింది. ఆ ప్రభావం అతనిపై కూడా కనిపించింది. కొల్లూరు పీహెచ్‌సీకి తరలించారు. పరిశీలించిన వైద్యురాలు... చెవులు, ముక్కు వెంబడి రక్తం వస్తుండటం గమనించి ప్రథమ చికిత్స అనంతరం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు సిఫార్సు చేశారు. అక్కడికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని గమనించిన వైద్యులు.. వెంటనే గుంటూరులోని జీజీహెచ్‌కు తరలించారు.



బాధితుడు అంజి

రెండు ఎడ్లు, గేదె మృతి

చీరాల టౌన్: పశువుల కొట్టాంలో కట్టివేసిన ఎడ్లపై ఒక్కసారిగా పిడుగు పడటంతో ఘటనా స్థలంలోనే రెండు ఎడ్లు మృతి చెందాయి. మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీకి చెందిన పిట్టు పోతురాజు రెడ్డి తన ఎడ్లతో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆదివారం అకాలంగా కురిసిన భారీ వర్షానికి పిడుగులు పడి రూ.2 లక్షల విలువైన రెండు ఎడ్లు మృతి చెందాయి. అదే గ్రామానికి చెందిన నాయుడు మనోహర రెడ్డికి చెందిన గేదె కూడా పిడుగుపాటుకు గురై మృతి చెందింది. ఘటనా స్థలాన్ని పశు వైద్యశాల సిబ్బంది పరిశీలించి వివరాలు సేకరించారు.

స్వర్ణ (కారంచేడు): మండలంలో ఆదివారం చిన్న చెరువు వద్ద పిడుగు పడి ఓ ఇంటిపై వాటర్ ట్యాంక్ బద్దలైపోయింది. ఇంటి శ్లాబ్‌పై పడి ఉంటే పెను ప్రమాదం జరిగేదని యజమాని నీరుకట్టు దయాశేఖర్‌రావు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.



ముగిసిన బగళాముఖి అమ్మ వారి కొలుపులు

చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి వార్షిక కొలుపులు (తిరునాళ్ల వేడుకలు) ఆదివారం ముగిశాయి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి ఆదివారం వరకు అత్యంత వైభవంగా ఇవి జరిగాయి. పిట్టలవానిపాలెం మండలంలోని సంగుపాలెం, కోడూరు, భవనంవారిపాలెం, చందోలు గ్రామాలతో పాటు చెరుకుపల్లి మండలంలోని కుంచలవారిపాలెం గ్రామంలో కూడా అమ్మవారి పావనం, ఘటానికి గ్రామోత్సవాలు నిర్వహించి పూజలు చేశారు. నాలుగో రోజు అమ్మవారికి పురాతన బంగారు నగలను అలంకరించారు. ఆదివారం భక్తులు పొంగళ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నివేదించారు. మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి వార్షిక కొలుపులు ముగిసినట్లు ఆలయ ఈవో నరసింహమూర్తి తెలిపారు.

ఆలయానికి విరాళాలు

అమ్మవారి గర్భాలయంలో పద్మ శిలాపీఠం, పంచలోహ నిర్మిత సింహాలు రూ.11 లక్షలతో చేయించి వేగేశన ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు అందజేస్తామని తెలిపారని ఆలయ ఈవో చెప్పారు. ఆలయం వద్ద పార్కింగ్ స్థల సేకరణ కోసం ఒంగోలుకు చెందిన తెల్లబాటి శ్రీనివాసరావు దంపతులు రూ.2,16,000, రేపల్లెకు చెందిన సనకా రగువంశీ రూ.2,16,000, పొన్నూరు – తలసిల శివప్రసాద్ రూ.1,16000, వెల్లటూరు – కొనకాల బుల్లిబాబు రూ.1,16,000, నెల్లూరు – దేశ్‌పాల్ సింగ్ రూ.1,16,000, గుంటూరు – దేశిరాజు చంద్రశేఖర్ ప్రసాద్ రూ.1,16,000, భవనంవారిపాలెం – దొంతిరెడ్డి కోటిరెడ్డి రూ.1,16,000 విరాళాలు ప్రకటించారని ఈవో ఓ ప్రకటనలో తెలిపారు.



శ్రీమాతా మహాదేవి అలంకరణలో అమ్మ వారు

ప్రశాంత వాతావరణంలో నీట్

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

చీరాల టౌన్: నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టమైన భద్రత నిర్వహించామని కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీలు తెలిపారు. ఆదివారం చీరాల పట్టణంలోని నీట్ పరీక్ష జరుగుతున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష జరుగుతున్న కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. చీరాల్లోని పరీక్ష కేంద్రాల్లో 416 మంది అభ్యర్థులను కేటాయించారని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో 176 మంది విద్యార్థులను కేటాయించగా 169 మంది విద్యార్థులు హాజరయ్యారని 7 మంది గైర్హాజరు అయినట్లు ప్రధాన ఆచార్యులు వారి దృష్టికి తెచ్చారు. విద్యుత్ సౌకర్యం, మంచినీరు, అత్యవసరమైన మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, తదితరులున్నారు.



చీరాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ

వేకువజామున మృత్యుఘోష

- జాతీయ రహదారిపై మూడు ప్రమాదాలు
- నిమిషాల వ్యవధిలోనే విగతజీవులైన ఐదుగురు
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- మృతులు నెల్లూరు, గుంటూరు జిల్లాల వాసులు
- డ్రైవర్ నిద్రమత్తుకు బలైన బాబాయ్– అబ్బాయ్‌లు
- మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ తల్లీకొడుకుల మృతి
- ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన రెండేళ్ల చిన్నారి

వేకువజామున ఒంగోలులో నిమిషాల వ్యవధిలో జరిగిన మూడు ప్రమాదాలతో జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఈ ఘటనల్లో ఐదుగురు విగతజీవులు కాగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలం చూపరులకు ఒళ్లు గగుర్పాటు కలిగించింది. దెబ్బతిన్న లారీ, నుజ్జు నుజ్జయిన కారులో ఇరుక్కొని పోయిన మృతదేహాలతో భయకంపితంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే రోడ్డుపై వందల వాహనాలు నిలిచిపోవడంతో గందరగోళం నెలకొంది. ఈ ప్రమాదాల్లో తల్లీకొడుకులు, బాబాయ్– అబ్బాయ్‌లు విగతజీవులయ్యారు.



రోడ్డుపై బోల్తా పడిన కోడిగుడ్ల లారీ



నుజ్జునుజ్జయిన కారును పరిశీలిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: జాతీయ రహదారిపై ఒంగోలు సమీపంలోని కొప్పోలు ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. నలుగురికి గాయాలు కాగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పోలు ఫ్లై ఓవర్ దాటిన తరువాత కొద్ది దూరంలో టైరు పంక్చర్ కావడంతో ఒక లారీ ఆగింది. సరిగ్గా అదే సమయంలో తెలంగాణ నుంచి నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడు గ్రామానికి కోడిగుడ్ల లోడుతో వెళుతున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో ప్రమాద స్థలానికి కొద్ది దూరంలో ఇటుక లోడుతో వస్తున్న ట్రాక్టర్, కారు, ఒక మినీ లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. దానికి 500 మీటర్ల దూరంలో మరో ప్రమాదం జరిగింది. గుంటూరు నుంచి తిరుపతి వెళుతున్న కారును వెనక నుంచి వచ్చిన భారీ కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ...

పెదకాకానికి చెందిన కొప్పురావూరు గ్రామానికి తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు గుంటూరులోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అమరావతి రోడ్డులో కుటుంబంతో ఉంటున్నారు. ఆయన తన సమీప బంధువైన బూచి వినయ్ కుటుంబంతో కలిసి మొక్కు తీర్చుకోవడానికి గుంటూరులో అర్ధరాత్రి రెండు గంటల తరువాత తిరుపతికి బయలుదేరారు. తెల్లవారుజామున 4.50 గంటలకు జాతీయ రహదారిపై ఒంగోలు చేరుకున్నారు. బైపాస్ నుంచి ఫ్లై ఓవర్ దిగిన తరువాత కొద్ది దూరంలో ఒక రోడ్డు ప్రమాదం జరగడంతో కారు ఆపారు. అంతలోనే వేగంగా వచ్చిన ఒక భారీ కంటైనర్ వారిని ఢీకొట్టింది. లారీ, కంటైనర్ల మధ్య చిక్కుకున్న కారు నుజ్జునుజ్జయింది. తిరుమలశెట్టి పావని (35), ఆమె కుమారుడు చంద్ర కౌశిక్ (15) అక్కడికక్కడే మృతి చెందారు. పావని భర్త తిరుమలశెట్టి వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. ప్రస్తుతం షాక్‌లో ఉన్న ఆయనకు నగరంలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పావని, కుమారుడు చంద్రకౌశిక్ (ఫైల్)

భర్త ఒంగోలులో...భార్య గుంటూరులో..

ఈ ప్రమాదంలో బూచి వినయ్ కుటుంబం పరిస్థితి దయనీయంగా ఉంది. తలకు తీవ్రంగా గాయాలైన వినయ్ కోమాలోకి వెళ్లిపోయారు. ఒంగోలులోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో అత్యవసరంగా ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. నవీన్ భార్య బూచి లావణ్యకు వెన్నెముకకు గాయం కావడంతోపాటు కాలు విరిగింది. దీంతో ఆమెకు మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఈ దంపతుల రెండేళ్ల కుమారుడు లోక్ స్మిత్ సురక్షితంగా బయటపడ్డాడు.

గమ్యం చేరకుండానే..

నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడు గ్రామానికి చెందిన రావినూతల బాబు (42), రావినూతల నాగేంద్ర (20) వరసకు బాబాయ్, అబ్బాయ్ అవుతారు. కోడిగుడ్లు తీసుకొని తెలంగాణలోని భువనగిరి నుంచి శనివారం రాత్రి బయలుదేరారు. కాసేపట్లో గమ్యస్థానం చేరుకుంటారనగా ప్రమాదం చోటుచేసుకోవడంతో లారీ డ్రైవర్ రవణయ్య అలియాస్ షేక్ రహీం (60) సహా బాబాయ్, అబ్బాయ్ దుర్మరణం పాలయ్యారు.

ప్రమాదస్థలిని పరిశీలించిన ఎస్పీ

ప్రమాదాల సమాచారం అందుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పర్యవేక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ.. అతివేగం, నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కంటైనర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మిగతా వాహనాల డ్రైవర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

పాముకాటుతో మహిళా కూలీ మృతి

30 గంటలు వైద్యశాలలో మృత్యువుతో పోరాటం

బల్లికురవ: పొలంలో కూలీ పనులు చేస్తుండగా పాము కాటు వేయటంతో 30 గంటల పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం సాయంత్రం ఓ మహిళాకూలీ మృతి చెందింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామానికి చెందిన గార్లపాటి మల్లేశ్వరి (52) కూలీనాలీ పనులు చేస్తూ భర్త కోటేశ్వరరావుకు చేదోడుగా నిలుస్తోంది. శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లగా పొలంలో పాము కాటు వేసింది. హుటాహుటిన తోటి కూలీలు వైద్యానికి చిలకలూరిపేటలోని ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం చనిపోయింది. మృతురాలికి భర్త, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే మల్లేశ్వరి.. పాము కాటుకు బలి కావడంతో కుటుంబ సభ్యులు, తోటి కూలీల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

పల్టీ కొట్టిన టిప్పర్.. తప్పిన పెను ప్రమాదం



కారంచేడు: కాలువ కట్టమీద ప్రయాణించే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన టిప్పర్ లారీ కొమ్మమూరు కాలువ అంచుకు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా పెను ప్రమాదం తప్పింది. వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారి 167/ఏ కి గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్ లారీ అదుపు తప్పి ఆదివారం బోల్తా కొట్టింది. కారంచేడు నుంచి కుంకలమర్రు వైపు వెళ్లే రహదారి కొమ్మమూరు కాలువ కట్టమీదగా ఉంటుంది. ఈ కట్టమీద ప్రయాణించే సమయంలో ఎదురుగా మరో వాహనం రావడంతో రోడ్డు మార్జిన్ దిగిన టిప్పర్ లారీ అప్పటికే వర్షం కురిసి ఉండటంతో మార్జిన్ నానిపోయి మెత్తగా తయారైంది. దీంతో టిప్పర్ లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన ప్లాక్లెయిన్ ద్వారా వాహనాన్ని తీయించారు.

పాత గురజాలమ్మ గుడిని పునరుద్ధరించాలి

గురజాల: పల్నాడు జిల్లా గురజాల పట్టణం శివారులో పులిపాడు వెళ్లే దారిలో గల వెయ్యేళ్ల నాటి శిథిల పాత గురజాలమ్మ గుడిని పునరుద్ధరించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానికులైన కందిమల్ల శ్రీనివాసరావు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన ఆదివారం గురజాలమ్మ ఆలయ శిథిలాలను పరిశీలించారు. ఆలయం పునాది వరకు మాత్రమే మిగిలి ఉందని, మహా మండపం ముందు మెట్లకు అందమైన ఏనుగు శిల్పాలు, అర్ధమండపం ముందు ప్రాణాలర్పించుకుంటున్న పల్నాటి వీరుడు, గర్భాలయంలో ఆనవాళ్లు కోల్పోతున్న గురజాలమ్మ విగ్రహం ఆలయ చరిత్రకు అద్దం పడుతున్నాయని చెప్పారు.

చీరాల చైర్మన్‌కు పదవీగండం?

చీరాల మున్సిపల్ చైర్మన్ పదవి కోసం వైఎస్సార్ సీపీని వదలి పచ్చ కండువా కప్పుకొన్న జంజనం శ్రీనివాసరావుకు భంగపాటు తప్పేలా లేదు. పచ్చ పార్టీలో చేరితే చైర్మన్‌గిరీ దక్కించుకోవచ్చని ఎత్తు వేసిన ఆయనకు ఇప్పుడు ఆ పార్టీ కౌన్సిలర్లు షాక్ ఇచ్చేలా కనిపిస్తున్నారు. ఆయన చైర్మన్‌గా ఉండడానికి వీల్లేదని ఆ కౌన్సిలర్లు పట్టుబడుతున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతోనూ వారు వాదిస్తున్నట్లు సమాచారం.

- మున్సిపల్ చైర్మన్‌ను గద్దె దించేందుకు యత్నాలు
- అవిశ్వాస తీర్మానానికి పచ్చ పార్టీ కౌన్సిలర్లు పట్టు
- ఆ పదవి కోసమే పార్టీ మారిన శ్రీనివాసరావు
- పార్టీ మారినా పదవి కుదరదంటున్న టీడీపీ కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే వద్ద పంచాయితీ పెట్టినా ప్రయోజనం శూన్యం
- చైర్మన్‌కు మద్దతు అవకాశాలు సన్నగిల్లుతున్న వైనం



చీరాల మున్సిపల్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జంజనం పార్టీ మారినందున ఆయన్నే చైర్మన్‌గా కొనసాగిద్దామని కొందరు పచ్చ నేతలు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా అందుకు టీడీపీ కౌన్సిలర్లు అంగీకరించడం లేదు. ఎమ్మెల్యే సర్దుబాటు చేయబోయినా వారు వినే పరిస్థితి లేదు. చీరాలలో రెండో అధికార కేంద్రంగా ఉన్న ఎమ్మెల్యే తనయుడి వర్గం సైతం జంజనం ఆ పదవిలో ఉండకూడదని పట్టుదలగా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా మున్సిపల్ చైర్మన్ పదవి ఇచ్చిన వైఎస్సార్ సీపీకి చేసిన ద్రోహం ఇప్పుడు జంజనంకు తెలిసి వచ్చేలా ఉంది.

పదవి కోసం పార్టీ మారి..

చీరాల మున్సిపాలిటీలో 33 మంది కౌన్సిలర్లు ఉండగా, అత్యధికంగా 22 స్థానలు గెలుచుకొని వైఎస్సార్‌సీపీ చైర్మన్ పీఠం దక్కించుకుంది. కూటమి అధికారంలోకి రావడం, చీరాల ఎమ్మెల్యేగా పచ్చపార్టీకి చెందిన ఎంఎం కొండయ్య ఎన్నిక కావడంతో వైఎస్సార్ సీపీ, మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గాలకు చెందిన 22 మంది పచ్చ పార్టీలోకి వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును పదవి నుంచి దించేందుకు కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే ఆమోదంతో ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకట మురళిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ మే నెల 14వ తేదీన బల నిరూపణకు గడువు పెట్టారు. గతంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఊహించని రీతిలో రాత్రికి రాత్రే ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుల సమక్షంలో పచ్చ పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్మన్‌గిరీతోపాటు తన రియల్ ఎస్టేట్ వ్యాపారాలను కాపాడుకునేందుకే జంజనం పార్టీ మారినట్లు ప్రచారం జరిగింది. దీంతోపాటు అంతకు ముందు అవిశ్వాసం పెట్టి దింపేస్తామంటూ ఎమ్మెల్యే ప్రకటించడం కూడా మరో కారణం కావచ్చని కొందరు భావిస్తున్నారు. మొత్తంగా వైఎస్సార్ సీపీ ద్వారా పదవి పొంది ఆ పార్టీని వంచించి పచ్చపార్టీలో చేరడం అప్పట్లో చీరాలలో చర్చనీయాంశంగా మారింది.

దించేందుకు పచ్చ పార్టీ పట్టు

పచ్చ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టగానే ఆ పార్టీ చీరాల పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెరపైకి వచ్చారు. చీరాల మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం అవసరం లేదని ప్రకటించడంతో ఆ పార్టీలోని లుకలుకలు బయటపడ్డాయి. జంజనం పార్టీ మారడంతో అవిశ్వాసం పెట్టిన పచ్చపార్టీ కౌన్సిలర్లకు మింగుడు పడడం లేదు. జంజనం శ్రీనివాసరావును చైర్మన్‌గా కొనసాగించేందుకే ఎమ్మెల్యేయే పార్టీలో చేర్పించుకున్నారన్న ప్రచారం ఉంది. దీంతో ఎమ్మెల్యేపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు అవిశ్వాసం పెట్టమని చెప్పి.. ఇప్పుడు పార్టీలోకి ఎలా చేర్పించారంటూ నిలదీస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన మంత్రులతోపాటు చినబాబు లోకేష్ పేషీ జోక్యంతోనే మున్సిపల్ చైర్మన్ పార్టీ మారారని ఎమ్మెల్యే తన వర్గీయులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితిలోనూ అవిశ్వాసం పెట్టి జంజనంను పదవి నుంచి తొలగించాలని పచ్చ పార్టీ కౌన్సిలర్లు ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే తనయుడు మహేంద్ర వర్గం సైతం శ్రీనివాసరావును పదవీచ్యుతుడిని చేయాల్సిందేనని పట్టుబడుతున్నట్లు సమాచారం.

తప్పని కుమ్ములాటలు

మరోవైపు పచ్చపార్టీలో చైర్మన్ పదవి కోసం లుకలుకలు మొదలైనట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు చైర్మన్‌గిరీ కోసం కౌన్సిలర్లు యాదవ సామాజిక వర్గానికి చెందిన సాంబశివరావు, గౌడ వర్గానికి చెందిన ఎస్.లక్ష్మీ, వైశ్య వర్గానికి చెందిన సుబ్బయ్యలు పోటీ పడుతున్నారు. పదవి తనకంటే తనకంటూ ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే మద్దతు కోసం కొందరు, ఆయన తనయుడి ఆశీర్వాదం కోసం ఇంకొందరు పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే కుటుంబం మాత్రం చైర్మన్ పదవి ఎవరికనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. చైర్మన్ పదవీకాలం పట్టుమని 8 నెలలు కూడా లేనందున పదవి కావాలంటే ఒక్కో కౌన్సిలర్‌కు కనీస రూ. 5 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని, ఇంత డబ్బు ఖర్చుచేసినా దానిని రాబట్టుకునే సమయం ఉంటుందా? అని పోటీ పడుతున్న వారు లెక్కలు వేస్తున్నట్లు సమాచారం. ముందు జంజనంను పదవి నుంచి దించివేయాలని పచ్చపార్టీ కౌన్సిలర్లు పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది. ఇదే జరిగితే జంజనం రెంటికీ చెడ్డ రేవడిలా మారడం ఖాయమని చీరాల వాసులు చర్చించుకుంటున్నారు.

రైల్వే అభివృద్ధికి నిధులు



మాట్లాడుతున్న తెన్నేటి కృష్ణ ప్రసాద్

చుండూరు(వేమూరు): బాపట్ల పరిధిలోని రైల్వే అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలోని రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దీనికోసం కేంద్రం నుంచి రూ.250 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్, క్రాసింగ్ గేట్ల వద్ద ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. వారికోసం రోడ్డు ఓవర్ వంతెనలు ఏర్పాటు చేశామని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో ఆరు వంతెనలు మంజూరు అయినట్లు పేర్కొన్నారు.

పొన్నూరు, వేమూరు నియోజకవర్గం మధ్య అరెమండ గ్రామం, బోడపాడు గ్రామం మధ్య బ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు. మోపర్రు, గాలివారి పాలెం మధ్య, మోదుకూరు, ఆలపాడు మధ్య, చుండూరు, ఆలపాడు మధ్య, వలివేరు, చినగాదెలవర్రు గ్రామాలు మధ్య కూడా వంతెనలు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కొలకలూరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్‌కు అశ్రు నివాళి

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హృదయ విదారకరంగా రోదించిన కుటుంబ సభ్యులు
- అంతిమయాత్రలో దీనంగా 7 సంవత్సరాల కుమారుడు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది



మృతుడు రవికృష్ణ (ఫైల్)

యద్దనపూడి: రోడ్డు ప్రమాదంలో శనివారం మృతిచెందిన సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ భట్టు రవికృష్ణ (38)కు ఆదివారం గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. అసోంలో సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవికృష్ణ 15 రోజుల కిందట స్వగ్రామం పూనూరు వచ్చాడు. శుక్రవారం మార్టూరు– గన్నవరం మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన విషయం విదితమే. పోస్టుమార్టం అనంతరం ఆదివారం సీఆర్పీఎఫ్ సిబ్బంది తమ వాహనంలో రవికృష్ణ భౌతికాయాన్ని ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం రవికృష్ణ భౌతికాయంపై త్రివర్ణ పతాకాన్ని కప్పి పుష్పాంజలి ఘటించారు. చిన్నవయస్సులోనే తన భర్త అర్ధాంతరంగా చనిపోవటంతో తనకు, తన బిడ్డలకు దిక్కెవరంటూ భార్య అనూష, తల్లిదండ్రులు సీతమ్మ, శివయ్య, కుమారులు గుండెలవిసేలా రోదించటం చూపరులను కలిచివేసింది. గ్రామంలో ప్రతి ఒక్కరిని ఎంతో ఆప్యాయంగా పలకరించే రవికృష్ణ మృత్యువాత పడటంతో కడసారి చూసేందుకు అతని స్నేహితులు, గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అశేష జనవాహిని మధ్య ఇంటి నుంచి అంతిమయాత్రగా వెళ్లి అధికార లాంఛనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడు దేవాన్ష్.. నాన్న, నాన్న అంటూ రోదిస్తూ వెళ్లటంతో చూపరులను కలిచివేసింది.

రణక్షేత్రంలో వీరాచారుల సందడి

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఆదివారం వీరాచారులు సందడి చేశారు. వదిలిపెట్టిన వీరాచారాన్ని మళ్లీ పునఃప్రతిష్ట చేసుకునే క్రతువులు రణక్షేత్రంలో జరిగాయి. వీరాచారులతో పాటు వారి బంధువులు వందలాదిగా తరలివచ్చి కార్యక్రమాలలో పాల్గొన్నారు.

వీరుల గుడి నాగులేరు ఒడ్డున వీరుల ఆయుధాలకు పూజ కట్టుకుని అక్కడ నుంచి చెన్నకేశవ స్వామి, అంకాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు భారీగా తరలిరావడంతో రణక్షేత్రంలో ఉత్సవ వాతావరణం నెలకొంది. వీరుల గుడి ఆవరణ భక్తులతో నిండిపోయింది. వీరాచారుల ఊరేగింపులో బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతం పాల్గొనడం విశేషం. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో వీరుల గుడి పూజారులు వివిధ రకాల క్రతువులు నిర్వహించారు.

కారెంపూడికి చెందిన కిల్లా స్వాములు కుమారులు, మనువళ్లు వదలిపెట్టిన వీరాచారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో విశ్రాంత డీటీ యడ్ల రామకృష్ణారావు, చెన్నకేశవస్వామి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కిల్లా చినకోటేశ్వరరావు, కిల్లా వంశస్తులు పాల్గొన్నారు.



వీరాచార నిర్వహణలో వీరాచారులు

విద్యార్థిని ఆత్మహత్య

లక్ష్మీపురం: బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు సరిగ్గా చదవలేకపోయానని మార్కులు తక్కువ వస్తాయనే మనస్తాపంతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన ఆదివారం కుందుల రోడ్డులో చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణనగర్ వైట్ హౌస్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కల్లూరి హరనాథ్‌బాబు గుంటూరు హౌసింగ్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాడు. ఆయనకు ఇద్దరు ఆడ సంతానం ఉన్నారు. పెద్ద కుమార్తె ఇంధు మేఘన (20) ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతోంది. వారం రోజులుగా పాస్‌పోర్ట్ పని మీద తిరుగుతూ సెకండ్ సెమిస్టర్‌కు పూర్తిగా సిద్ధం కాలేకపోయింది.

ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్సై తరంగిణి ఘటనా ప్రదేశంలో ఆత్మహత్య చేసుకున్న వైనాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జీజీహెచ్‌కు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సంఘటన స్థలంలో గాయపడిన బుజ్జి బాబు



బైక్ ఢీకొని ధ్వంసమైన డివైడర్ భాగం

వేటపాలెం: వేర్వేరు ప్రమాదాల్లో ఆదివారం ఇద్దరు మృతి చెందారు. బైక్‌పై వేగంగా వెళుతూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ బాలుడు మృతి చెందాడు. చీరాల–వేటపాలెం ప్రధాన రహదారిలో దేశాయిపేట నూలు మిల్లు సెంటర్ వద్ద ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కొణిజేటి చేనేతపురి కాలనీకి చెందిన ఎస్. బుజ్జి బాబు (17) వేటపాలెం నుంచి బైక్‌పై చీరాల వైపు వేగంగా వెళుతున్నాడు. నూలు మిల్లు సెంటర్ వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ని బలంగా ఢీకొట్టాడు. రోడ్డుపై పడి తలకి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి వెళ్లాడు. 104లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించిన అనంతరం మృతి చెందాడు.

కొరిశపాడు పైవంతెన వద్ద..



మృతుడు వీరయ్య

మేదరమెట్ల(అద్దంకి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొరిశపాడు పైవంతెన వద్ద ఆదివారం జరిగింది. దైవాలరావూరు గ్రామానికి చెందిన గాలి వీరయ్య (65)కు మతి స్థిమితం ఉండదు. ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అతను రోడ్డుపై నడుస్తుండగా కొరిశపాడు పైవంతెన వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ఆస్తులకు రక్షణగా ఎల్‌హెచ్‌ఎంఎస్

- వరుస చోరీలపై 'సాక్షి'లో ప్రత్యేక కథనం
- స్పందించిన పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- దొంగతనాల నివారణపై అధికారులకు ఆదేశాలు



ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్: ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) ఉపయోగపడుతుందని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. వరుస చోరీలపై 'తాళం పడిందా.. ఇల్లు గుల్ల' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎస్పీ.. జిల్లాలోని పోలీస్ అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు ఇచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ మొబైల్ యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవి సెలవుల్లో ఇతర ప్రదేశాలకు వెళ్లే వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దొంగతనాల నియంత్రణకు ఈ వ్యవస్థను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ సౌకర్యం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన ఎక్కువ దొంగతనాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలోని ప్రజలు ఇల్లు విడిచి బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో సంబంధిత పోలీసు స్టేషనుకు ముందస్తు సమాచారాన్ని అందించాలన్నారు. వారి ఇళ్లకు పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారన్నారు.

వినియోగించుకోండిలా..

అందరూ స్మార్ట్ ఫోనులో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఇంటి నుంచే తమ పేరు, ఫోను నంబరు, లొకేషన్ వంటి ఇతర వివరాలు పొందుపరిచి రిక్వెస్ట్ పంపాలన్నారు. మొబైల్ నంబరుకు ఒక రిజిస్ట్రేషను నంబరు వస్తుందన్నారు. ఈ నంబరునే యూజర్ ఐడీగా పొందవచ్చునని పేర్కొన్నారు.

స్టేషన్ నుంచి పోలీసులు సదరు ఇంటిని సందర్శించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. సీసీ కెమెరాలతో ఈ యాప్ అనుసంధానం కావడం వలన దొంగతనాలు జరగకుండా నియంత్రించవచ్చునన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇంటి పరిసరాలలోకి ప్రవేశించిన వెంటనే పోలీసు కంట్రోల్ రూముకు సమాచారం చేరవేస్తూ అలారం మోగుతుందని చెప్పారు. దొంగతనాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

సామాజిక సమస్యలను స్పృశించిన నాటికలు



సురభి ప్రభావతికి జీవితసాఫల్య పురస్కారం ప్రదానం



'అ సత్యం' నాటికలో సన్నివేశం

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో జరుగుతున్న ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం ముగిశాయి. చివరిరోజున డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ కొచ్చెర్లకోట జగదీష్ జ్యోతిప్రజ్వలనతో ప్రదర్శలనలను ఆరంభించారు. తొలుత చైతన్య కళాస్రవంతి, ఉక్కునగరం, విశాఖపట్నం వారి 'అ సత్యం' నాటికను ప్రదర్శించారు. మనిషి సత్యం చెప్పినా అబద్ధం ఆడినా దానివెనుక ఏదొక భయమో? స్వార్థమో ఉంటుంది. దానివల్ల అతడికి మేలు జరగొచ్చు లేదా కీడు కలగొచ్చు. నిజానికి యదార్థమైనా ఒక చెడుకు దోహదపడితే అది అసత్యం...అబద్ధమైనా ఒక మంచికి తోడ్పడితే అది సత్యం...అనేదే నాటిక సారాంశం. సుధ మోదుగు కథను పిన్నమనేని మృత్యుంజయరావు నాటకీకరించారు. పి.బాలాజీనాయక్ దర్శకత్వంలో ప్రదర్శించారు. దర్శకుడు బాలాజీనాయక్‌తో పాటు పి.రామారావు, వై.అనిల్‌కుమార్, ఎం.వాసు, థబూమస్, ఎస్.మాధవి నటించారు. తదుపరి లలిత శ్రీ కళాసమితి, శ్రీకాకుళం వారి 'మతమా...మానవత్వమా?' నాటికను ప్రదర్శించారు. మతం అనేది ఎప్పటికీ శాశ్వతం కాదనీ, మానవత్వమే శాశ్వతమని. మనిషికి మానవత్వమే ప్రధానమని, అదే నిలిచి వెలుగుతుందని సందేశాన్నిచ్చిందీ నాటిక. కంచర్ల సూర్యప్రకాశరావు రచనను ఎల్.రామలింగస్వామి దర్శకత్వంలో ప్రదర్శించారు. ప్రధాన పాత్రల్లో బోసుబాబు, కేతిరెడ్డి రాజేశ్వరి, గుత్తు రవిబాబు, ప్రసాదవవు, లక్ష్మణరావు, కామేశ్వరరావు నటించారు. చివరగా శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి 'జనరల్ బోగీలు' నాటికను ప్రత్యేకంగా ప్రదర్శించారు.

జీవితసాఫల్య పురస్కారం

ఇదే వేదికపై యడ్లపాడు 'వేదిక' పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన గోపరాజు బాలాత్రిపుర సుందరమ్మ జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రముఖ రంగస్థల, టీవీ, సినీనటి సురభి ప్రభావతికి ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ చేతులమీదుగా ప్రదానం చేశారు. ప్రముఖ రూపశిల్పి ఎం.మదన్‌మోహన్ స్మారకంగా పసుమర్రుకు చెందిన రంగస్థల రూపశిల్పి పచ్చల శేషగిరిని సత్కరించారు. వివిధ కళాపరిషత్‌ల బాధ్యులు నూతలపాటి సాంబయ్య, వల్లూరు శివప్రసాద్, చాగంటి నాగేశ్వరరావు, కల్వకొలను అనంత్, గోగిశెట్టి వర్మ మాట్లాడారు. నిర్వాహక సంస్థల బాధ్యులు గోపరాజు రమణ, గోపరాజు విజయ్, సుద్దపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.